సాక్షి చిత్తూరు

గురువారం । 6 । జూలై । 2023



మెడికల్ క్యాంపులు నిర్వహించండి

జగనన్న సురక్ష కార్యక్రమాల్లో మెడికల్ క్యాంపులను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు.

- 8లో



సంతోషంగా సాగుబాట

వ్యవసాయ కరెంట్ నాణ్యతగా ఇస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	32	25
తిరుపతి	33	26
తిరుమల	28	22
గూడూరు	34	28
నగరి	33	26

న్యూస్‌రీల్

నేటి నుంచి సదరన్ స్లాట్ బుకింగ్‌లు

చిత్తూరు రూరల్: సదరన్ స్లాట్ బుకింగ్‌కు గురువారం నుంచి ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్ తెలిపారు. అన్ని సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి బుకింగ్‌లు ప్రారంభంకానున్నాయన్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి స్లాట్ నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సదరన్ సర్టిఫికెట్‌కు అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

అందుబాటులోకి బృందావనాలు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో నిర్మించిన బృందావనాలు వంద శాతం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంగా పకడ్బందీగా చేపడుతున్నట్లు వివరించారు. స్వామిత్ర సర్వే పనులు వేగవంతంగా చేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో నూతన గృహాలు నిర్మించుకునే ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను తప్పనిసరిగా నిర్మించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఓడీఎఫ్ 94 శాతం ఉన్నట్లు తెలిపారు. డ్వామా పీడీ గంగాభవాని మాట్లాడుతూ తమ శాఖ ఆధ్వర్యంలో గుర్తించిన 6.62 ఎకరాల్లో ఈనెల 20 వ తేదీలోపు మొక్కలు నాటే పనులు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీపీవో లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై క్షేత్రస్థాయిలో అవగాహన



సర్టిఫికెట్లను అందజేస్తున్న జేసీ శ్రీనివాసులు

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి, అవసరమైన పత్రాలను ఉచితంగా ఇచ్చేందుకు అమలు చేస్తున్న జగనన్న సురక్షపై క్షేత్రస్థాయిలో అధికారులు మరింత అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం పెనుమూరు మండలం చార్వగానిపల్లెలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జగనన్న సురక్ష కింద ప్రజలకు అవసరమైన అన్ని సేవలు నెలరోజుల పాటు సచివాలయాల ద్వారా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఇందుకు అధికారుల బృందం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉచిత సేవలను పొందేలా క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులు చైతన్యం తేవాలని సూచించారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. తహసీల్దార్ కళావతి పాల్గొన్నారు.

నేడు ఎస్జీటీలకు ఉద్యోగోన్నతులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఎస్జీటీలకు గురువారం ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో విజయేంద్రరావు వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్) ఉద్యోగోన్నతులకు కసరత్తు పూర్తి చేసినట్లు తెలిపారు. అర్హులైన ఎస్జీటీల వివరాలు డీవైఈవో, ఎంఈవోలకు పంపినట్లు చెప్పారు. సీనియారిటీ జాబితాలోని ఎస్జీటీలు ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. క్వాలిఫికేషన్ సర్టిఫికెట్‌ల, సర్వీస్ రిజిస్టర్‌లతో హాజరు కావాలని సూచించారు.

సజావుగా హెచ్‌ఎంల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని హెచ్‌ఎంలకు బుధవారం సర్దుబాటు కౌన్సెలింగ్ సజావుగా పూర్తయింది. సర్‌ప్లస్ కసరత్తులో భాగంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని 36 మంది హెచ్‌ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీఈవో విజయేంద్రరావు వెల్లడించారు. వీరికి ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. వెంటనే బదిలీ అయిన పాఠశాలల్లో చేరాలని డీఈవో వెల్లడించారు. ఏడీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ స్వర్ణలత, రామ్‌కుమార్, సిబ్బంది గోపాల్, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టి 'తల్లులు'!

- చిత్తూరు నగరానికి చెందిన ఓ యువతి (17) కుటుంబం బెంగళూరులో నివాసముంటోంది. ఇంటర్‌తో చదువుకు స్వస్తి చెప్పిన ఆ యువతి ఓ ప్రైవేటు కంపెనీలో పనికి చేరింది. అక్కడ పరిచయమైన 20 ఏళ్ల కుర్రాడితో ప్రేమలో పడింది. పెళ్లి కాలేదు కానీ..గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు గుట్టుచప్పుడు కాకుండా చిత్తూరుకు తీసుకువచ్చి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రసవం చేయించారు. పుట్టిన శిశువు (ఆడబిడ్డ)ను బంగారుపాళ్యంలోని పిల్లలు లేని దంపతులకు అప్పగించేశారు.
- పలమనేరు చెందిన 18 ఏళ్ల గర్భిణికి 7వ నెలలోనే పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబీకులు ఆమెను హైరిస్క్ కేసుగా గుర్తించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. డాక్టర్లు శస్త్రచికిత్స చేసి బిడ్డను బయటకు తీశారు. చివరకు శిశువు పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడ వారం రోజులపాటు చికిత్స చేసినా బిడ్డ మృతి చెందింది.

ఇవి మచ్చుకు రెండే.. ఇలాంటివి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోకొల్లలుగా జరుగుతున్నాయి. తెలిసీ తెలియని వయసు. ప్రేమకు ఆకర్షణకు వ్యత్యాసం తెలుసుకోలేని లేత మనసు. పాశ్చాత్య పోకడలపై పెరుగుతున్న మోజు. సినిమాలు.. సెల్‌ఫోన్లు కొందరు టీనేజర్లపై తీవ్రమైన ప్రభావం చూపిస్తున్నాయి. చిరుప్రాయంలోనే గర్భం దాల్చే పరిస్థితిని తీసుకువస్తున్నాయి. క్షణికావేశంలో చేసే చిన్నపాటి తప్పులే వారి జీవితాలను చిదిమేస్తున్నాయి. చివరకు ఆరోగ్యాన్ని పణంగా పెట్టి అబార్షన్ చేయించుకునే దుస్థితిని కల్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే కొన్నిచోట్ల తల్లిదండ్రులు తమ తొందరపాటు కారణంగా బాలికల బతుకులను చీకటిలోకి నెట్టేస్తున్నారు. బంధుత్వం కోసమో.. ఆస్తులు అంతస్తుల కోసమో.. బాధ్యత తీర్చేసుకోవాలనే తాపత్రయంతోనే ఆడపిల్లలను బాల్యవివాహాలకు బలి చేసేస్తున్నారు. సంసార సాగరంలోకి బలవంతంగా నెట్టేసి చిట్టితల్లుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



- టీనేజీలోనే అమ్మలవుతున్న అమ్మాయిలు
- 18 ఏళ్లు నిండకనే ప్రసవాలు
- పెరుగుతున్న అక్రమ అబార్షన్లు
- చిన్న వయసులోప్రెగ్నెన్సీతో అనర్థాలంటున్న వైద్యులు
- నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు

సాక్షి, తిరుపతి డెస్క్ : ముక్కుపచ్చలారని బాలికలు తల్లులవుతున్నారు. 18 ఏళ్లు నిండకనే గర్భవతులవుతున్నారు. వయసు తీసుకువచ్చిన ఆకర్షణలతోపాటు బాల్య వివాహాలతో సైతం చిన్నారులు తల్లులుగా మారుతున్నారు. ఏటా ఇలాంటి కేసులు పదుల సంఖ్యలో పెరుగుతున్నాయి. మాతా శిశు మరణాలకు దారితీస్తున్నాయి. మైనర్ బాలికల్లో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. ఇదే సమయంలో పలు చోట్ల టీనేజర్లకు గుట్టుగా అబార్షన్లు జరుగుతున్నాయి. అయితే ఇలాంటివి పలు అనర్థాలకు దారితీస్తాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమంగా అబార్షన్లు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రతి నెలా 300లకు పైగానే..!

ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రుల్లో ప్రతినెలా దాదాపు 5 వేలకు పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. అయితే వీటిలో 18 ఏళ్లు నిండని వారు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నట్లు వైద్యశాఖ అధికారులు గుర్తించారు. అధికారికంగా ప్రతినెలా 300లకు పైగా టీనేజీ అమ్మాయిలకు ప్రసవాలు జరుగుతున్నట్లు నిర్ధారించారు. ముఖ్యంగా ప్రైవేట్ హాస్పిటళ్లలోనే 150 నుంచి 200 వరకు టీనేజర్లకు ప్రసవాలు చేస్తున్నట్లు అంచనా వేశారు. ఇలా చిన్నవయసులోనే గర్భం దాలిస్తే మాతాశిశుమరణాలు సంభవించే ప్రమాదముందని వైద్యులు వెల్లడిస్తున్నారు. అబార్షన్లు చేయించుకున్నా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. వీటి దుష్ప్రభావాలను జీవితాంతం ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.



టీనేజీ ప్రసవాలపై మెడికల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి (ఫైల్)

ప్రైవేట్ దందా

టీనేజీలో గర్భం దాల్చిన బాలికలకు గుట్టుచప్పుడు కాకుండా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల వారు అబార్షన్ చేస్తున్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా గర్భాలను విచ్ఛిన్నం చేస్తున్నారు. ఇందుకోసం కొందరు ప్రత్యేకంగా భవనాలను అద్దెకు తీసుకుని దందా సాగిస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలపై ఉక్కుపాదం మోపేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

చిత్తూరు జిల్లాలో టీనేజర్ల ప్రసవాల వివరాలు

జనవరి	ఫిబ్రవరి
103	146
మార్చి	**ఏప్రిల్**
43	108
మే	**జూన్**
106	124

తిరుపతి జిల్లాలో టీనేజర్ల ప్రసవాల వివరాలు

జనవరి	ఫిబ్రవరి
89	74
మార్చి	**ఏప్రిల్**
64	85
మే	**జూన్**
95	83

ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రుల వివరాలు

టీచింగ్ హాస్పిటళ్లు	జిల్లా ఆస్పత్రి	ఏరియా వైద్యశాలలు	సీహెచ్‌సీలు	పీహెచ్‌సీలు	ప్రైవేట్ ఆస్పత్రులు
2	1	7	15	108	సుమారు 3వేలు

టీనేజీలో ప్రసవం.. నష్టాలు

- తీవ్రస్థాయిలో రక్తపోటు
- పెల్విక్ ఎముకలు దృఢంగా లేకపోవడం వల్ల సాధారణ కాన్పుకి ఇబ్బందులు ఏర్పడే అవకాశం
- నెలలు నిండక ముందే బిడ్డ పుట్టడం
- కడుపులోనే శిశువు మరణించడం
- తక్కువ బరువుతో జన్మించడం
- శిశువుకు శ్వాస సంబంధిత సమస్యలు రావడం
- బిడ్డ ఎదుగుదలలో లోపాలు
- తల్లి పోషకాల లోపంతో బిడ్డలో మానసిక, శారీరక సమస్యలు
- కాన్పు సమయంలో తల్లి మృతి చెందే అవకాశం

బాల్యవివాహాల నివారణకు కృషి



బాల్యవివాహాలను అరికట్టేందుకు ముమ్మరంగా కృషి చేస్తున్నాం. ఎక్కడైనా మైనర్ బాలికలకు పెళ్లి చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే అక్కడ వెళుతున్నాం. తల్లిదండ్రులు, పెళ్లి పెద్దలు, వధూవరులను కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత 6 నెలల్లో 107 బాల్యవివాహాలను అడ్డుకున్నాం. మైనర్లకు వివాహం జరిపిస్తుంటే సమీపంలోని మహిళా పోలీసు, సీడీపీఓ, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం అందించాలి. టోల్ ఫ్రీ నంబరు 1098, 100కు తెలియజేయవచ్చు.

– శ్యాంసుగుణకుమారి, సీడీపీఓ, చిత్తూరు

శ్రేయస్కరం కాదు



15 నుంచి 19 ఏళ్లలోపు అమ్మాయిలకు ప్రసవాలు శ్రేయస్కరం కాదు. ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులు వస్తాయి. ముఖ్యంగా శారీరక, మానసికంగా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మాతా శిశు మరణాలకు కూడా దారితీసే ప్రమాదముంది. ఇక పెళ్లి కాకుండా అబార్షన్లకు వస్తున్నారు. బయట తెలియక ఎన్నో జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో అవగాహన తీసుకురావాలి.

– ఉషశ్రీ, గైనకాలజిస్ట్, జిల్లా ఆస్పత్రి, చిత్తూరు

ఇది చట్ట విరుద్ధం



ప్రస్తుతం సమాజంలో ఆధునిక పోకడల కారణంగా పలువురు పిల్లలు దారితప్పుతున్నారు. ప్రేమలో పడి 18 ఏళ్లలోపే పెళ్లిళ్లకు సిద్ధపడుతున్నారు. కొందరు పెద్దల సమక్షంలోనే పెళ్లి చేసుకుంటున్నారు. బాల్యవివాహాలు చట్ట విరుద్ధం. వీటిని ప్రోత్సహిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. పరిస్థితులను వివరిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలి.

– వెంకట సుబ్బమ్మ, బీఎన్‌పేట ఎస్‌ఐ, చిత్తూరు

అక్రమ అబార్షన్ల కట్టడి



అక్రమ అబార్షన్లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. కొందరు ఆర్‌ఎంపీలు, బయట వ్యక్తులతో అబార్షన్లు చేయించుకుంటున్నారు. ఇలాంటి వాటి వల్ల గర్భసంచిలో సమస్యలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎవరమైనా అబార్షన్లు చేయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఇలాంటివి ఎవరి దృష్టికి వచ్చినా వెంటనే మాకు ఫిర్యాదు చేయవచ్చు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– రవిరాజు, పీసీపీఎన్‌డీటీ, చిత్తూరు

వినాయకునికి వెండి మొలతాడు



వెండి మొలతాడు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామికి బెంగుళూరుకు చెందిన శశిధర్ వెండి మొలతాడును కానుకగా అందించారు. దాత కుటుంబ సభ్యులతో కలసి బుధవారం స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆలయ అధికారులను కలసి 700ల గ్రాముల వెండితో(రూ.50 వేలు)తయారు చేసిన మొలతాడును అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు.

జిల్లాకు అదనంగా ఎనిమిది 108 వాహనాలు

చిత్తూరు రూరల్: ప్రభుత్వం జిల్లాకు కొత్తగా ఎనిమిది 108 వాహనాలను కేటాయించినట్లు మేనేజర్ మోహన్ తెలిపారు. ఈ వాహనాలను వి.కోట, బైరెడ్డిపల్లె, కాణిపాకం, సదుం, గుడిపాల, చిత్తూరు, జీడీనెల్లూరు, ఎస్‌ఆర్ పురం మండలాలకు కేటాయించామని పేర్కొన్నారు.

పరిహారం.. విష ప్రచారం!

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తోంది. ఇందుకోసం పకడ్బందీగా కార్యాచరణ అమలు చేస్తోంది. అర్హులందరికీ బీమా సొమ్ము చెల్లించేందుకు సన్నద్ధమవుతోంది. ఇది చూసి ఓర్వలేని పచ్చమీడియా తప్పుడు రాతలతో ప్రజలను పక్కదోవ పట్టించేందుకు యత్నిస్తోంది. లబ్ధిదారుల జాబితా పూర్తిస్థాయిలో సిద్ధం కాకుండానే సక్రమంగా పరిహారం పంపిణీ చేయడంలేదంటూ అసత్య కథనాలతో విషం చిమ్ముతోంది.



- శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామానికి చెందిన ఈ రైతు పేరు బి.అమరనాథ్‌రెడ్డి. గత ఏడాది 8.98 ఎకరాల్లో పంట సాగు చేశాడు. వైపరీత్యాల కారణంగా 33 శాతం కంటే ఎక్కువ మోతాదులో పంట నష్టం వాటిల్లింది. దీంతో ఈయనకు పరిహారం కింద రూ. 24 వేలను ప్రభుత్వం అందించనుంది. సకాలంలో నష్టం అంచనా వేసి బీమా సొమ్ము చెల్లిస్తుండడంపై రైతు హర్షం వ్యక్తం చేస్తున్నాడు.



- కేవీబీ పురానికి చెందిన ఈ రైతు పేరు కె.ఏలుమలై. గత ఏడాది 2.36 ఎకరాల్లో వేరుశనగ సాగు చేయగా పంట దెబ్బతింది. దీంతో ప్రభుత్వం రూ.6 వేల పరిహారం చెల్లించనుంది. రైతులకు అండగా నిలుస్తూ ఉచితంగానే బీమా సౌకర్యాన్ని కల్పించి, పరిహారం కూడా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని సదరు రైతు ఆనందంగా చెబుతున్నాడు.

- నష్టపోయిన పంటలకు బీమా
- 8న లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు సన్నాహాలు
- మొత్తం 51,491 మంది రైతులకు రూ.10.64 కోట్లు
- ఆర్‌బీకేలో జాబితాల ప్రదర్శన
- మార్పులు పూర్తికాకనే పచ్చమీడియా తప్పుడు రాతలు

చిత్తూరు అగ్రికల్చర్ : గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు, ఈదురుగాలులకు పంట నష్టపోయిన అన్నదాతలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని రైతు దినోత్సవం నాడు లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేయనుంది. ఈ మేరకు లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటికే ప్రచురించారు. దీనిపై ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేసి అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. అయితే ఎల్లో మీడియా లబ్ధిదారులకు సక్రమంగా పరిహారం చెల్లించడం లేదని, కొంతమందికి చాల తక్కువ సొమ్మును బీమా కింద ప్రకటించారని అసత్య కథనాలతో తప్పుడు ప్రచారానికి ప్రయత్నిస్తోంది.

పంట నష్టం గుర్తింపు ఇలా...

వాతావరణ పరిస్థితుల కారణంగా నష్టపోయిన పంటలకు బీమా కల్పించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. సాగు చేస్తున్న ప్రతి పంటను ముందస్తుగానే ఈ-క్రాప్ నమోదు చేస్తోంది. పంట నష్టం వాటిల్లినప్పుడు ఆయా గ్రామాల రైతు భరోసా సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. నష్టాన్ని నమోదు చేస్తారు. అందులో నిబంధనల మేరకు 33 శాతానికి మించి దెబ్బతిన్న పంటలను మాత్రమే బీమా పరిధిలోకి తీసుకుంటారు. ఈ విధంగా సేకరించిన జాబితాలను ముందస్తుగా ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు. అందులో నష్టపోయిన పంట నమోదు కాకపోయినా, అనర్హులు ఉన్నా ఆర్‌బీకే సిబ్బంది దృష్టికి తీసుకువస్తే వెంటనే మార్పులు, చేర్పులు చేస్తారు. ఈ విధంగా సిద్ధం చేసిన జాబితాల మేరకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లిస్తుంది. అయితే ఈ ప్రక్రియ పూర్తి కాకుండానే రైతు భరోసా కేంద్రాల్లో ప్రాథమికంగా ప్రకటించిన జాబితాల ఆధారంగా పచ్చమీడియా తప్పుడు రాతలు రాసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తోంది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో మొత్తం 51,491 మంది రైతులకు సంబంధించిన పంటలు నష్టపోయినట్లు అధికారులు ఇప్పటి వరకు గుర్తించారు. వారికి రూ.10.64 కోట్లు పరిహారంగా చెల్లించాలని నిర్ణయించారు. అయితే ఈ సంఖ్యలో మార్పుచేర్పులు ఉండే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

అన్నీ అవాస్తవాలే

సాధారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాల్లో వేరుశనగ, టమాట పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. వరి, జొన్న తదితర పంటలు తూర్పు మండలాలైన శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లో పండిస్తారు. అయితే పచ్చమీడియా ఈ విషయాన్ని వదిలిపెట్టి తూర్పు మండలాల్లో వేరుశనగ, టమాట, పడమటి మండలాల్లో వరి లాంటి పంటలకు బీమా వర్తించలేదని అసత్యాలను వల్లిస్తోంది.

నిబంధనల మేరకే..



నిబంధనల ప్రకారమే 2022 ఖరీఫ్ సీజనుకు సంబంధించి పంట బీమా లబ్ధిదారుల జాబితా తయారు చేశాం. పంట నష్టాన్ని బట్టి రూ.260 నుంచి రూ. 24 వేల వరకు పరిహారం పొందిన రైతులు ఉన్నారు. వెదర్ బేసిక్ స్కీమ్, వీల్డ్ బేసిక్ స్కీమ్ రెండు పద్ధతుల్లో బీమా అందిస్తున్నాం. పక్కాగా సర్వే నిర్వహించి వాస్తవిక జాబితాలను సిద్ధం చేశాం.

– ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, తిరుపతి

పండుగలా వ్యవసాయం

- నాడు సాగు దండగన్న చంద్రబాబు
- నేడు రైతులకు అండగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి




మాట్లాడుతున్న నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : వ్యవసాయం దండగ అని చెప్పిన చంద్రబాబునాయుడు పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఎన్నో జరిగాయని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అదే వ్యవసాయాన్ని పండుగలా చేసి రైతన్నలకు అండగా నిలుస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన శ్రీరంగరాజపురంలో పర్యటించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, పిచికారీ మందులు, ఈ-క్రాప్ నమోదు, రైతు భరోసా కింద రూ.13500 పెట్టుబడి సాయం అందిస్తున్నారని తెలిపారు.

నాకు మళ్లీ చదవాలని ఉంది

శ్రీరంగరాజపురం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలును డిప్యూటీ సీఎం తనిఖీ చేశారు. భోజనం రూచి చూశారు. ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా జగనన్న గోరుముద్ద కింద రోజుకో మెనూ చొప్పున పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ భోజనం తింటుంటే తనకు పాఠశాలలో చదవాలనిపిస్తోందన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలను రూపురేఖలు మార్చినట్లు తెలిపారు.



క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 76,254 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,091 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.90 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో, ప్రత్యేక దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పలు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కుప్పం: కుప్పం పరిసరాల్లో పలు చోరీ కేసుల్లో నిందితుడు, కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన నాగరాజ్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్ సమీపంలోని బొమ్మ సముద్రం గ్రామానికి చెందిన నాగరాజ్ కుప్పం ప్రాంతంలో రెండేళ్లుగా చోరీలకు పాల్పడుతున్నాడు. 2021లో కుప్పం మండలం మల్లానూరు గ్రామంలోని ఓ ఇంట్లో దొంగతనం చేశాడు. ఈ ఏడాది కుప్పం మండల జరుగు గ్రామంలో, శాంతిపురం టౌన్‌లోని ఓ దుకాణంలో, సోమల, కుప్పం, రామకుప్పం, మండలాల్లో వివిధ దొంగ తనాలు చేసినట్లు విచారణలో తేలింది. నిందితుడి నుంచి రూ.15 లక్షలు విలువ చేసే 150 గ్రాములు బంగారు నగలు, 100గ్రాముల వెండి, షిఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీధర్ వివరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సంతోషంగా రైతుల సాగు బాట

గత టీడీపీ పాలనలో రైతులకు కరెంట్ ఎప్పుడొస్తుందో తెలీదు.. ఆవచ్చే కరెంట్ తరచూ ట్రిప్ అవుతూ, ట్రాన్స్‌ఫార్మర్లు కాలుతుండేవి. దీంతో పంటలు ఎండుతుండేవి. కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రీప్లేస్ చేయాలంటే కాళ్లరిగేలా తిరగాల్సిందే. కరెంట్ కోతలతో సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ధర్నాలు, నిరసనలు చూశాం. వ్యవసాయ విద్యుత్ సర్వీసు కావాలంటే ఏళ్లు పట్టేవి. ఇదంగా గతం. నేటి వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు ఉచితంగా తొమ్మిది గంటల నాణ్యమైన కరెంట్ అందుతోంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ నెలలోపే అందుతోంది. జగనన్న ఇళ్లకు ఉచితంగా కరెంట్ సర్వీసులు, కాలనీకి పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం. ఇది నాటి పాలనకు, నేటి పాలకు తేడాగా జనం చెప్పుకుంటున్నారు.



- సేద్యానికి ఇబ్బంది లేకుండా కరెంట్
- రూ.158 కోట్ల వ్యయంతో కొత్తగా 33 సబ్‌స్టేషన్లు
- వ్యవసాయానికి 9 గంటల ఉచిత కరెంట్
- జగనన్న కాలనీలకు ఉచితంగా కరెంట్ సర్వీసులు
- ఉచిత విద్యుత్ కోసం ట్రాన్స్‌కోకు రూ.101 కోట్లు

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాగుకు కరెంట్ కష్టాలు తప్పడంతో రైతుల మోములో ఆనందం వెల్లివిరిస్తోంది. సాగుకు నాణ్యమైన కరెంట్ 9 గంటలపాటు అందుతోంది. గతంలో కరెంట్ కష్టాలను చవిచూసిన రైతులు నేటి ప్రభుత్వంలో ఎటువంటి బెంగ లేకుండా సంతోషంగా సాగు చేసుకుంటున్నారు. రైతాంగంపై ప్రభుత్వం చూపుతున్న ఆసక్తిపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉచిత విద్యుత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.101 కోట్లను ట్రాన్స్‌కోకు చెల్లిస్తోంది. నాణ్యమైన కరెంట్ సరఫరా కోసం కేంద్ర విద్యుత్ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి) నుంచి ఏడు వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకొంది. దీంతో భవిష్యత్తులో సాగుకు నాణ్యమైన కరెంట్ అందనుంది. ఉచితంగా విద్యుత్ ఇచ్చేదిలేదంటూ బషీరాబాగ్‌లో రైతులపై బాష్పవాయువును ప్రయోగించి రైతులనే కనికరం లేకుండా గుర్రాలతో తొక్కించి నలుగురు రైతుల మరణానికి కారణమైయ్యారు నాడు చంద్రబాబు. ఉచిత కరెంట్ ఇస్తే తీగలపై బట్టలారేసుకోవాల్సిందేనంటూ హేళన చేశారు. కాని అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన స్ఫూర్తితో మొదలైన రైతులకు ఉచిత విద్యుత్ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిరాటకంగా కొనసాగిస్తూ రైతులకు కరెంట్ కష్టాలనే మాట లేకుండా చేశారు.

తీరిన లోఓల్టేజ్ సమస్య

గతంలో కరెంట్ లోఓల్టేజి కారణంగా తరచూ కరెంట్ పోతుండేది. దీంతో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్‌లు, కాలిపోతుండేవి. ముఖ్యంగా టయల్ ఎండ్‌లో పరిస్థితి మరీ ఘోరంగా ఉండేది. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం రూ.158కోట్ల వ్యయంతో కొత్తగా 33 సబ్‌స్టేషన్లు(11కేవీ), 242కిలోమీటర్ల మేర 11కేవీలైన్, 152కిమీమేర ఎల్‌టీలైన్లు, 958 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. దీంతోబాటు మూడు బోరు మోటార్లకు గతంలో 15 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చేవారు. ఇప్పుడు 25హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. దీంతో మోటార్లకు 360 నుంచి 415 ఓల్ట్స్ కరెంట్ వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు లేనేలేవు. కాలిన ట్రాన్స్‌ఫార్మర్ల రీప్లేస్‌మెంట్ వేగంగా సాగుతోంది.

సాగుకు పగటిపూటే

గతంలో రైతులకు ఏడు గంటల కరెంట్ సక్రమంగా వచ్చేదికాదు. రెండు, మూడు షిఫ్ట్‌ల్లో ఇచ్చేవారు. రాత్రి షిఫ్టులో ఎందరో రైతులు కరెంట్‌షాక్, పాము కాట్లకు బలయ్యేవారు. కాని ఈ ప్రభుత్వంలో పగటి పూటే 9 గంటలపాటు నాణ్యమైన కరెంట్ ఇస్తున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలో 96 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 296 కిమీ మేర 33కేవీ లైన్లు, 76 బ్రేకర్లను అమర్చారు. రూ.లక్ష విలువజేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను రైతుకు రూ.12,500కే ఇస్తున్నారు.

తొలగిన డార్క్ ఏరియా సమస్య

గతంలో డార్క్ ఏరియా నోటిఫైడ్ గ్రామాల్లో కొత్తగా వ్యవసాయకనెక్షన్లు ఇచ్చేవారు కాదు. ఈ ప్రభుత్వం వచ్చాక వర్షాలు సంవృద్ధిగా కురవడంతో భూగర్భ జలమట్టాలు బాగా పెరిగాయి. డార్క్ ఏరియా సమస్యపై దృష్టి సారించిన ప్రభుత్వం 99శాతం గ్రామాలను జాబితా నుంచి తొలగించింది. దీంతో జిల్లాలో కొత్త బోర్లు వేసుకునేందుకు, సర్వీసు పొందేందుకు అవకాశం ఏర్పడింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం	
మొత్తం ఇంటి సర్వీసులు	: 3,81,690
వ్యవసాయ మోటార్ కనెక్షన్లు	: 1.25లక్షలు
కుటీర పరిశ్రమల సర్వీసులు	: 4736
వాణిజ్య సర్వీసులు	: 4163
జిల్లాలోని జగనన్న లేఅవుట్లు	: 592
200 యూనిట్ల సబ్సిడీ సర్వీసులు	: 75,309

నెలరోజుల్లోనే వ్యవసాయ కనెక్షన్

సచివాలయంలో దరఖాస్తు చేసి ట్రాన్స్‌కో వారికి ఎస్టిమేషన్ ఖరీదు, డిపాజిట్ చెల్లించిన నెలలోపే సర్వీసు వస్తోంది. జనగనన్న ఇళ్లు, కాలనీలో కరెంట్ సర్వీసు పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం మంజూరు చేస్తోంది. కాలనీల్లో పూర్తిస్థాయిలో ఉచితంగా ఎలక్ట్రిఫికేషన్ పనులు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 75,309 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.24కోట్లను భరిస్తోంది. రీవాంప్(ఆర్‌డీయస్‌ఆర్) పథకం కింద స్మార్ట్‌మీటరింగ్, నెట్‌వర్క్ బలోపేతం కోసం కేంద్రం రూ.676 కోట్లు చిత్తూరు జిల్లాకు కేటాయించింది. దీంతోకొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం 592 జగనన్న లేఅవుట్లకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు.

కరెంట్ బాధలు ఏమాత్రం లేవు



గతంలో లాగ ఇప్పుడు వ్యవసాయానికి కరెంట్ సమస్యలేదు. కొత్త వ్యవసాయ కనెక్షన్లు సులభంగా ఇస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలితే రీప్లేస్‌మెంట్ రెండు, మూడు రోజుల్లో చేస్తున్నారు. 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లను రైతుల పొలాల వద్ద పెట్టడంతో నాణ్యమైన కరెంట్ అందుతోంది. నిజంగా ఇది రైతుల ప్రభుత్వం.

- వెంకట రెడ్డి,కల్లాడు, పలమనేరు మండలం

వ్యవసాయానికి ఇబ్బందులు లేవు



గతంలో ఉన్న కరెంట్ సమస్యలను అధిగమించాం. ట్రాన్స్‌కో కోసం ప్రభుత్వం ఏటా రూ. కోట్లాది నిధులను వెచ్చిస్తోంది. ముఖ్యంగా జిల్లాలో లోఓల్టేజీ సమస్యను తీర్చాం. రైతులకు 9 గంటలపాటు కరెంట్ సరఫరా సాగుతోంది. ఇందుకోసం కొత్త సబ్‌స్టేషన్లు, లైన్లు, బ్రేకర్ల నిర్మాణాలను చేపట్టాం. నెలలోపే వ్యవసాయ కనెక్షన్లు ఇస్తున్నాం.

- ఎం.కృష్ణారెడ్డి, ట్రాన్స్‌కో,ఎస్ఈ, తిరుపతి



చిత్తూరు బులియన్	
బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

మెడికల్ క్యాంప్‌లు నిర్వహించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ క్యాంపులను ఏఏ తేదీల్లో నిర్వహిస్తారన్న విషయాన్ని ముందస్తుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. క్యాంపుల నిర్వహణను నియోజకవర్గ, మండల అధికారులు తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో జరుగు తున్న రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను కేటాయించిన గడువు లోపు పూర్తి చేయాలని తహసీల్దార్లు, సర్వే బృందాలను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని జెడ్పీ స్కూల్ అసిస్టెంట్‌లకు గ్రేడ్ హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో విజయేంద్రరావు పేర్కొన్నారు. డీవైఈవో, ఎంఈవోలకు పంపిన జాబితాలను పరిశీలించుకుని స్కూల్ అసిస్టెంట్‌లు సర్వీస్ రిజిస్టర్‌తో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. 2001 డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని డీఈవో పేర్కొన్నారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బంగారుపాళ్యం(ఐరాల): మండలంలోని సంక్రాంతిపల్లె జాతీయ రహదారి వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుంగనూరుకు చెందిన యువకుడు వినయ్‌కుమార్(21) మృతి చెందాడు, మరో యువకుడు గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి... పుంగనూరుకు చెందిన వినయ్‌కుమార్, కిరణ్ ద్విచక్రవాహనంలో చిత్తూరుకు బయలుదేరారు. మార్గమధ్యమంలో సంక్రాంతిపల్లె వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరూ కిందపడి గాయపడ్డారు. అదే సమయంలో చిత్తూరు నుంచి పెద్దపంజాణికి వెళుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్ విశ్వనాథ్ క్షతగాత్రులను గుర్తించారు. 108కు సమాచారం అందించారు. వాహనం రావడం కొంత ఆలస్యం కావడంతో తీవ్రంగా వినయ్‌కుమార్‌కు సీపీఆర్(కార్డియో పలమనరి రెసిప్రేటరీ) ఇస్తు సపర్యలు చేశారు. వాహనం రావడంతో వినయ్‌కుమార్‌ను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



క్షతగాత్రుడికి సీపీఆర్ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్

అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు. ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ చొరవను స్థానికులు అభినందించారు. అయినా యువకుడు మృతి చెందడం బాధాకరం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చరిత్రలో నిలిచిన సీఎం సభ

- టీడీపీ అధికారంలోకి రావడం కలే
- చిత్తూరు అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ధ్వజం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులో మంగళవారం జరిగిన సీఎం జగనన్న పర్యటన చరిత్రలో నిలిచిపోయే విధంగా అట్టహాసంగా జరిగిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార యంత్రాంగం, ఉద్యోగులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ క్యాడర్, మీడియా ఇలా సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యావాదాలు తెలిపారు. చిత్తూరులో జరిగిన అమ్మఒడి సభ కంటే మంగళవారం జరిగిన కార్యక్రమం బాగా నిర్వహించినట్లు సీఎం మెచ్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. సభలో చిత్తూరుకు జగన్న వరాలు ఇవ్వడం ఆనందకరమని తెలిపారు.



మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తప్పుడు ప్రచారం తగదు

చిత్తూరు అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సవాలు విసిరారు. నాలుగు సంవత్సరాలుగా చిత్తూరు నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుంటే టీడీపీ, సీప్యాక్, చిత్తూరు అభివృద్ధి కమిటీ, జనసేన నాయకులు, మరికొందరు పనిగట్టుకుని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడంపై మండిపడ్డారు. చిత్తూరు అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



నరసింహులు నాయుడు(ఫైల్)

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లెలో మనస్తాపంతో నరసింహులునాయుడు(52) మంగళవారం రాత్రి ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం.. నరసింహులునాయుడు వ్యవసాయం చేస్తూ జీవనం చేస్తున్నాడు. భార్య సరస్వతి, కుమారుడు మోహన్‌బాబు, కుమార్తె భవ్య ఉన్నారు. పిల్లలిద్దరికీ వివాహాలు అయ్యాయి. కొంత కాలంగా పంటలకు పురుగు మందులు పిచికారీ చేసేందుకు వెళ్లేవాడు. ఈ క్రమంలో శ్వాసకోశ వ్యాధులకు గురై చికిత్స చేయించుకుంటున్నాడు. దీనికి తోడు 7 నెలల కిందట అల్లుడు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తీవ్ర ఆవేదనకు గురై, జీవితంపై విరక్తి తో గ్రామ సమీపంలోని పొలంలో కానుగ చెట్టుకు ఉరేసుకుని మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కత్తిపోటుకు గురైన వ్యక్తి మృతి



మృతిచెందిన శ్రీరాములు

చౌడేపల్లె: కత్తిపోటుకు గురై చికిత్స పొందుతున్న మండలంలోని వెంగళపల్లె పంచాయతీ పాలెంపల్లెకు చెందిన శ్రీరాములు (50) మృతి చెందినట్లు ఎస్‌ఐ రవికుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 3వ తేదీ రాత్రి భార్య బోయ కొండమ్మతో శ్రీరాములు గొడవ పడే సమయంలో, శ్రీరాములుపై బోయ కొండమ్మ అన్నకుమారుడు రమేష్, ఆమె చెల్లెలు కుమారుడు విజయ్ కత్తితో దాడి చేసి కడుపులో పొడిచారు. వెంటనే ఆయనను తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడిలో చుక్కల జింక మృతి



మృతి చెందిన చుక్కల జింక

ఐరాల: కుక్కల దాడిలో చుక్కల జింక మృతి చెందిన ఘటన మండలంలోని చెంగనపల్లె వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చెంగనపల్లె అటవీ ప్రాంతం సమీపంలోని పొలంలో దాహం తీర్చుకునేందుకు ఓ చుక్కల జింక వచ్చింది. కుక్కలు పసిగట్టి దాడికి పాల్పడ్డాయి. కుక్కలను చెదరగొట్టి జింకను కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు తెలిపారు. ఐరాల బీట్ అధికారి రెడ్డిప్రసాద్‌కు సమాచారం అందించడంతో ఆయన సంఘటన స్థలానికి చేరుకున్నారు. జింక కళేబరాన్ని పోస్టుమార్టం అనంతరం ఖననం చేస్తామన్నారు.

మైనింగ్ అధికారిపై టీడీపీ నేతల దాడి



మైనింగ్ అధికారిపై దాడి చేస్తున్న టీడీపీ నేతలు

చంద్రగిరి(తిరుపతి రూరల్) : మండలంలోని నాగయ్యగారిపల్లెలో బుధవారం మైనింగ్‌శాఖ అధికారిపై స్థానిక టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. వివరాలు.. గ్రామ పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి ఓ ప్రైవేటు సంస్థ ప్రతినిధులు ఇసుక తరలించేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ప్రస్తుతం ఓ రోడ్డు నిర్మిస్తున్నామని, ఇసుకకు ఐదురోజుల్లో అనుమతుల వస్తాయని, పనులు ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతోనే వచ్చామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అయితే అనుమతులు వచ్చాయే ఇసుక తరలించేందుకు రావాలని గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఇంతలో స్థానిక టీడీపీ నేతలు ఓవర్ యాక్షన్ చేశారు. మైనింగ్ అధికారులు, ప్రైవేట్ సంస్థ ప్రతినిధులతపై దాడి చేశారు. అధికారి చంద్రారెడ్డిపై చేయి చేసుకోవడమే కాకుండా రికార్డులను లాక్కున్నారు. సీఐ రాజశేఖర్ అక్కడకు చేరుకుని టీడీపీ నేతలను అడ్డుకున్నారు. అధికారులు, సంస్థ ప్రతినిధులను పంపేశారు.

కుప్పంలో బలిజలకు గుర్తింపునిచ్చిన ప్రభుత్వం

కుప్పం:నియోజకవర్గంలో బలిజ సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం బలిజ భవన్ నిర్మాణానికి వివాదంలో ఉన్న స్థలం కేటాయించి, రూ.కోటి నిధులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీలు ప్రకటనకే పరిమితమైంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన బలిజ కులస్తులు ఈ సమస్యలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ బోర్డు సభ్యుడు పోకుల అశోక్ కుమార్, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి భూ వివాదాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. సంబంధిత పట్టాదారులతో, న్యాయవాదులతో ప్రత్యేకంగా మాట్లాడి పరిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ప్రతిష్టాపనకు అనుమతి ఇస్తూ పూర్తి స్థాయిలో స్థలం బలిజ కులస్తులకు కేటాయించారు. మంత్రి ఆదేశాల మేరకు ఎంపీ రెడ్డెప్ప సొంత నిధులతో బలిజ భవన్ ప్రహరీ నిర్మాణానికి రూ.25 లక్షలు అందించారు. ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. దీంతో బలిజ సామాజిక వర్గం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. ఏళ్ల తరబడి చంద్రబాబును నమ్మి మోసపోయామని, ముఖ్యమంత్రితో పాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రుణపడి ఉంటామని స్పష్టం చేసింది.



బలిజ భవన్ ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ(ఫైల్)

బాబు హయాంలో...

కుప్పం మండల పరిధిలోని పలార్లపల్లె రెవెన్యూ సర్వే నంబర్ 22లో 2.80 ఎకరాల స్థలాన్ని గతంలో మిలటరీ మాజీ అధికారి ప్రభుత్వం కేటా యించింది. గతంలో దీనిపై రెవెన్యూ అధికారులు పట్టాలను రద్దు చేసి ప్రభుత్వ భూమిగా బోర్డులు నాటారు. మిలటరీ మాజీ అధికారి పట్టాను చేతపట్టి పోరాటం సాగించారు. ఇలాంటి వివాదాల భూమిని బలిజ భవన్ నిర్మాణానికి ఇస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. దీంతో మిలిటరీ మాజీ అధికారి కోర్టును ఆశ్రయించారు. అంతేకాకుండా బలిజ భవన్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ప్రకటనలన్ని బాబు కాగితాలకే పరిమితం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకతో బలిజభవన్ సమస్యలు సమశాయి.

కన్నతల్లి, జన్మనిచ్చిన ఊరును గౌరవిస్తే ఉన్నత స్థాయికి..

- ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం): కన్న తల్లిని, జన్మనిచ్చిన ఊరును గౌరవించే వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఏఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసీ.విజయానందరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నెల్లేపల్లె ఉన్నత పాఠశాలకు కే.జ్ఞానశేఖర్‌రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.10 లక్షలతో భవనాన్ని నిర్మించి కంప్యూటర్లను వితరణ చేశారు. ముఖ్య అతిథిగా విజయానంద రెడ్డి ఆ భవనానికి ప్రారంభోత్సవం చేసి మాట్లాడారు. నెల్లేపల్లెమిట్టకు చెందిన జ్ఞానశేఖర్‌రెడ్డి తిరుపతిలో స్థిరపడినా పుట్టిన ఊరుపై మమకారంతో రూ.10 లక్షలతో భవనాన్ని నిర్మించి, కంప్యూటర్లు ఇవ్వడం ప్రశంసనీయమని అభినందించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడి విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. అలాగే నెల్లేపల్లెమిట్టకు రెండు కిలోమీటర్ల దూరంలో స్మార్ట్ డీవీ సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేయనున్నామని, ఈ పరిశ్రమతో సుమారు 5 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఇందులో స్థానికులకు ప్రాధాన్యతనిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు మాట్లాడుతూ, జ్ఞానశేఖర్‌రెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, గతంలో కూడా విద్యాశాఖలో దాదాపు 700 మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించారని, మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాలు తీర్చిదిద్దడానికి ఎంతో సహకరించారని అభినందించారు. జ్ఞానశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, తన ఉన్నతికి కారణమైన జన్మనిచ్చిన ఊరుకు తనవంతుగా చేయాలనే ఉద్దేశంతో భవనాన్ని నిర్మించి, కంప్యూటర్లు ఇచ్చినట్లు చెప్పారు. విద్యను మించిన ఆస్తి మరేదీ లేదని, ఆ దిశగా విద్యార్థులు పురోగమించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అధికారులు, నెహ్రూ యువకేంద్ర సమన్వయకర్త ప్రదీప్ కుమార్, స్థానిక సర్పంచ్, ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.ఎంఈఓ ఆంజనేయులు పాల్గొన్నారు.



జ్ఞానశేఖర్‌రెడ్డి నిర్మించిన కంప్యూటర్ భవనానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

DISTANCE EDUCATION
ఒకే సం.లో 10వ తరగతి/ఇంటర్మీడియట్ తప్పక పాస్ అయ్యే అవకాశం. దూరవిద్య ద్వారా BA, B.Com (Gen/Comp.Sci), B.Sc, BBA, MBA, M.A, M.Com కోర్సులందు అడ్మిషన్లు జరుగుచున్నవి. ✆ 9494873721.

ONE SITTING
Direct 10th, Inter one Sitting, B.A, B.Com, B.Sc, BBA, B.Tech, M.A, M.Com, M.Sc, MBA, MCA, Distance Education, Tirupati, 7416478396, 7416478395.

PARAMEDICAL
B.Sc Nursing, BPT & Paramedical Courses Available, DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395.

Real Estate

FLATS FOR SALE
తిరుపతి, కపిలతీర్థం దగ్గరలో NGOs కాలనీలో కొత్త అపార్ట్‌మెంట్ నందు Ready to Occupy 2 BHK ఫ్లాట్‌లు అమ్మకానికి కలవు. నో బ్రోకర్ Pl. ✆ 6304610041.

PLOTS FOR SALE
గుంటూరు, గోరంట్ల, అమరావతిరోడ్డు కార్పొరేషన్ పరిధిలో విల్లాస్‌కి దగ్గర ఇన్వెస్ట్‌మెంట్/ కన్‌స్ట్రక్షన్‌కు అనువైన 200 చ॥గ॥ల ప్లాట్లు కలవు. రేటు గ॥ 13 వేలు- 16 వేలు. 9502168948

Services

బంగారం కొనబడును
బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును.స్పాట్‌క్యాష్✆ 8886 177 699

AGRI BUSINESS
మంచి నాణ్యత కలిగిన వర్మికంపోస్ట్ (వాన పాముల ఎరువు) మా వద్ద లభించును. ద్వారకామయి వర్మికల్చర్ యూనిట్, కోటపల్లి గూడూరు, నెల్లూరు జిల్లా. 99899 75557.

Wanted

వార్డెన్ కావలెను. S.V.డిఫెన్స్ అకాడమీ లో పనిచేయుటకు వార్డెన్ కావలెను. (Male Only). ఆకర్షణీయమైన జీతం, Contact Cell: 9440271534.

కొత్తగా ప్రారంభించిన మా కంపెనీ నందు 28 మంది ఫ్రీ/ఫ్రె లకు ఉద్యోగాలు, జీ: 1400+DA 6000+ ఫ్రీరూం, అ:7th to డిగ్రీ పా/ఫె. సింధూ ప్రమోషన్స్,K.K.లేఔట్,తిరుపతి, 9182593225.

తిరుపతి, తిరుమల & C.రామాపురంలో పరిసరాలలో పనిచేయుటకు కేటరింగ్ బాయ్స్, సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ & క్లీనింగ్ స్టాఫ్ M/F కావలెను. ✆ 9100518607.

JOB VACANCY: TIK PVT. LTD. Age: 18 to 45 yrs. Qul: 10th to Any Degree. Salary: 18,000/- to 25000/- Contact ✆ 8712008071

Wanted Delivery Boys MNC Courier Company at Tirupati Location. Salary: 12,000 + Petrol ✆ 9177541210

Wanted Medical Representatives for Tirupati. Contact : 7032640251.

ప్రముఖ డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ నందు ఫీల్డ్ కో-ఆర్డినేటర్స్‌గా చిన్నగొట్టుకల్లు, ఎర్రావారిపాలెం, పాకాల, రొంపిచెర్ల నందు పనిచేయుటకు స్వంత ద్విచక్ర వాహనం కలిగిన అభ్యర్థులు కావలెను సంప్రదించవలసిన ✆ 6281103765

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/-, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. ఫోన్: 8919613884.

గ్లోబల్ కంపెనీలో డిజిటల్‌గా వర్క్ చేస్తూ నెలకు 35,000/- వరకు సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు లేవు. సంప్ర : 79956 36002

RBL CREDIT CARDS AGENCY నందు పని చేయుటకు Recovery Executives కావలెను. జీతం + అలవెన్స్ : 16వేలు. వివరాలకు సంప్రదించండి : 7981657599, 8985898117.

ఓల్డ్ రికార్డ్స్ చూసి న్యూ రికార్డ్స్ వ్రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 70756 58208

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, భార్యభర్తలు, డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901

మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. కాల్ చేయండి. 95736 33520, 90596 33520.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
Contact
9705444178
951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ఎవరి, వారి విశ్వసనీయతను పరిశీలించిన పిదప ప్రచురించడమైనది. మా పాఠకులకు ఈ విషయం తెలియజేస్తున్నాం. ప్రకటనదారు తరిపే క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ లోన్లు ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయమన్న ప్రకటనల విషయాన్ని గమనించగలరు.